


రేమిడిచర్లలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

బొల్లాపల్లి: రేమిడిచర్లలోని ప్రసన్నాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు చేశారు.



కుడి కాలువకు నీటి నిలుపుదల

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 511.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు నీటిని నిలుపుదల చేశారు.



నాగులగుడిలో గోపుర కలశ ప్రతిష్ఠ

పిడుగురాళ్ల : పిల్లుట్ల రోడ్డులోని నాగులగుడిలో గురువారం గోపుర కలశ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



బాపట్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బాపట్ల మండలం సూర్యలంక దగ్గర నగరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ చెట్లు నరకడం వలన గ్లోబల్ వార్మింగ్ ఏర్పడిందన్నారు. అది పెను విపత్తుకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మాట్లాడుతూ కాలుష్య నివారణ, పర్యావరణ సమతుల్యత లక్ష్యాలుగా పర్యావరణ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. ఈ ఏడాది 'ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే అంశంతో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. జిల్లాలోని 477 పంచాయతీలలో సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆప్కో చైర్మన్ డా.సజ్జల హేమలత, డీఎఫ్ఓ కె.వినోద్ కుమార్, బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా, కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

పీ-4 మార్గదర్శిల నమోదులో బాపట్ల ప్రథమం

బాపట్ల: పీ-4 మార్గదర్శిల నమోదులో బాపట్ల జిల్లా 60 శాతం పురోగతి సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పీ-4, యోగాంధ్ర, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, తహసిల్దార్లతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు మూడు వేలమంది మార్గదర్శిలు పీ-4లో నమోదైనట్లు చెప్పారు. బంగారు కుటుంబాలను మార్గదర్శిలు ఎంపిక చేసుకోవడం, దత్తత చూసుకోవడంపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జూలైలో బాపట్ల జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెప్పారు. ఐటీసీ కంపెనీ 80,000 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తుండగా, ఆ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. సీపీఓ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, డీఈఓ పురుషోత్తమరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 5.72 కోట్ల రాయితీ సొమ్ము విడుదల

జిల్లాను పారిశ్రామికంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల ఎగుమతుల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు జిల్లాలో పరిశ్రమల కోసం 202 దరఖాస్తులు చేసుకోగా కమిటీ పరిశీలించి దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసిందన్నారు. 186 పరిశ్రమలకు రూ.5.72 కోట్ల రాయితీ సొమ్ము మంజూరైనట్లు కలెక్టర్ వివరించారు.

చతికిల బడి

ఏడాదిగా తిరోగమనంలో ప్రభుత్వ విద్య

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు శిరిష, ఇళ్లల్లో పాచి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. భర్త తాపీ పనికి వెళుతుంటాడు. వీరు బాపట్ల పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ ఉంటారు. వీరికి ఇద్దరు పిల్లలు. వీరిద్దరూ కష్టపడుతూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. ఇద్దరు పిల్లల్లో ఒకరు 4వ తరగతి, మరొకరు 2వ తరగతి చదువుతున్నారు. తనకు చిన్నప్పుడు చదువంటే ఎంతో ఇష్టమని, అయితే తన తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి కారణంగా తాను మధ్యలోనే చదువు ఆపేశానని, తాము పడుతున్న కష్టాలు తమ బిడ్డలు పడకూడదనే ఉద్దేశంతో బిడ్డలను బాగా చదివించాలని భావిస్తున్నామని శిరీష తెలిపారు. గతంలో ఫీజులకు ఇబ్బంది పడేవారం కామని, నేడు ప్రభుత్వం వాగ్దానం చేసిన తల్లికి వందనం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఇద్దరు బిడ్డలకు ఆ డబ్బులు వస్తే వారి చదువులకు ఎంతో భరోసాగా ఉంటుందని తెలిపారు.

- వైఎస్ జగన్‌తోనే విద్యాభివృద్ధి
- గతంలో నాడు–నేడుతో కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ బడులు
- అర్ధంతరంగా నిలిచిన నాడు–నేడు పనులు
- జాడలేని 'తల్లికి వందనం'
- జిల్లాలో తల్లికి వందనం కోసం 1.92 లక్షల మంది ఎదురుచూపులు
- నాడు రూ. 32.6 కోట్లతో 14,582 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ
- విద్యార్థుల ఫీజులు, ఖర్చుల కోసం అప్పులు చేస్తున్న తల్లిదండ్రులు



నాడు-నేడు కింద కార్పొరేట్ తరహాలో నిర్మించిన బాపట్ల బాలికల ఉన్నత పాఠశాల భవనం

బాపట్ల టౌన్: చదువుకు పేదరికం అడ్డురాకూడదు...ప్రతి తల్లీ తన బిడ్డలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్న లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గతంలో 'అమ్మఒడి' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పిల్లలను బడికి పంపే ప్రతి తల్లి ఖాతాకు నేరుగా రూ.15 వేలు చొప్పున విద్యా సంవత్సరం ఆరంభంలోనే జమ చేసింది. జిల్లాలో లక్షలాది మంది విద్యార్థులు, వేలాది మంది తల్లులు లబ్ధి పొందారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు చంద్రబాబు తమ ఎన్నికల మేనిఫెస్టోలో 'అమ్మ ఒడి' పేరును 'తల్లికి వందనం'గా మార్పు చేసి ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ప్రతిఒక్కరికీ రూ.15 వేలు చొప్పున జమ చేస్తామంటూ కూటమి నేతలు ఊరూరా ఊదరగొట్టారు. తీరా కూటమి సర్కార్ కొలువుతీరి ఏడాది గడిచినా ఇప్పటికీ దీనిపై విధివిధానాలు లేవు.

నాడు పౌష్టికాహారం.. నేడు అధ్వానం

పిల్లలు చదువులో రాణించాలంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో 'జగనన్న గోరుముద్ద' పేరుతో పౌష్టికాహారం అందించారు. అది కూడా రోజుకో మెనుతోపాటు కోడిగుడ్డు, రాగిజావ, చిక్కీ అందజేస్తున్నారు. దీంతో పిల్లలు ఆడుతూ పాడుతూ విద్యనభ్యసిస్తూ సంతోషంగా ఉన్నారు. వీటితోపాటు నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లోని విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, కిచెన్ షెడ్లు, ఇంగ్లిష్ ల్యాబ్, పెయింట్స్, బోర్ సౌకర్యం, మరుగుదొడ్లు తదితర పనులు చేయించారు. నేడు జిల్లాలోని అనేక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ సక్రమంగా అమలు కాని దుస్థితి. కొన్నిచోట్ల కోడిగుడ్డు కూడా ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కొందరు విద్యార్థులు ఇంటినుంచి క్యారియర్లలో భోజనం తెచ్చుకుంటున్నారు.

వైఎస్ జగన్ హయాంలో జమచేసిన అమ్మఒడి నిధులు

విద్యాసంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం రూ. కోట్లలో
2019-20	1,14,550	రూ.171.82
2020-21	1,16,019	రూ.162.42
2021-22	1,19,953	రూ. 155.94
2022-23	1,17,827	రూ.176.75

వైఎస్ జగన్ హయాంలో 2023-24 లో విద్యాదీవెన జమ

విభాగం పేరు	విద్యార్థుల సంఖ్య	నగదు
ఎస్సీ వెల్ఫేర్	8515	రూ. 6,52,12,330
ఎస్టీ వెల్ఫేర్	946	రూ. 71,46,077
బీసీ వెల్ఫేర్	10,454	రూ. 8,88,90,179
ఈబీసీ వెల్ఫేర్	5089	రూ. 4,81,93,828
ముస్లీం మైనార్టీ	1850	రూ. 1,54,51,875
కాపు వెల్ఫేర్	2404	రూ.2,19,99,427
క్రిస్టియన్ మైనార్టీ	144	రూ.13,72,193
మొత్తం	29402	రూ. 24,82,65,909

వైఎస్ జగన్ హయాంలో 2022-23 లో వసతి దీవెన జమ

విభాగం పేరు	విద్యార్థుల సంఖ్య	నగదు
ఎస్సీ వెల్ఫేర్	8587	రూ. 8,03,75,000
ఎస్టీ వెల్ఫేర్	990	రూ. 92,25,000
బీసీ వెల్ఫేర్	10,871	రూ. 10,36,90.000
ఈబీసీ వెల్ఫేర్	5522	రూ. 5,38,10,000
ముస్లీం మైనార్టీ	1892	రూ. 1,81,12,500
కాపు వెల్ఫేర్	2613	రూ. 2,51,05,000
క్రిస్టియన్ మైనార్టీ	136	రూ.13,27,500
మొత్తం	30,611	రూ. 29,16,45,000

తల్లులకు అండగా జగనన్న

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని 2020 జనవరి 9వ తేదీన ప్రారంభించారు. అదే ఏడాది కరోనా రావడంతో మునుపటి ఏడాదిలోని పిల్లలందరినీ అర్హులుగా నిర్ణయించి, 2021 జనవరి 9న రెండో ఏడాది కూడా పథకం నిధులను జమ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని, విద్యాప్రమాణాలను పెంచేందుకు 75 శాతం హాజరుశాతం తప్పనిసరిగా ఉండాలనే ప్రాతిపదికన అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 2022 జూన్ 27న, 2023 జూన్ 28న నిధులను విడుదల చేశారు. ఉన్నత చదువులకు సైతం జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పేరుతో వెన్నుదన్నుగా నిలబడింది. పిల్లలు చదువులో రాణించాలంటే సంపూర్ణఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో 'జగనన్న గోరుముద్ద' పేరుతో పౌష్టికాహారం అందించారు.

తల్లికి వందనమేదీ చంద్రన్నా..?

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1417, ప్రైవేట్ పాఠశాలలు 413 ఉండగా ఆయా పాఠశాలల్లో గతేడాది గణంకాల ప్రకారం 1.92 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో అమ్మ ఒడి పథకం కింద 2023 లో 1.17 లక్షల మంది లబ్ధిదారులకుగానూ రూ.176.75 కోట్లమేర లబ్ధిపొందారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో 1.92 లక్షల మందికిపైగా పథకం వర్తించాల్సి ఉంది. ఈమేరకు రూ.176.75 కోట్లు పైగానే 2024-25 విద్యాసంవత్సరంలో అందాల్సి ఉండగా.. కూటమి ప్రభుత్వం వాటిని విడుదల చేయలేదు. దీంతో ఎంతో మంది పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. తల్లికి వందనం నిధులు ఎప్పుడు జమచేస్తారోనని తల్లులు ఎదురుచూస్తున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విద్యార్థులకు మెరుగైన విద్యాబుద్ధులు అందించాలనే లక్ష్యంలో 2022-23 విద్యాసంవత్సరంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 22 వేలు విలువచేసే ట్యాబ్‌లు, దానిలో రూ. 15 వేల విలువ చేసే బైజూస్ కంటెంట్‌ను నిక్షిప్తం చేసి పంపిణీ చేశారు. గరిష్ఠంగా ఒక్కో ట్యాబ్‌కు రూ. 37 వేలు ఖర్చుచేసి పేద విద్యార్థులకు అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ట్యాబ్‌లను అందించకపోగా.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) విద్యాబోధన విధానాన్ని అటకెక్కించింది.



బాపట్ల జిల్లాలోని విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

నాడు ప్రగతి.. నేడు అధోగతి

నాడు-నేడు ద్వారా జిల్లావ్యాప్తంగా 1488 పాఠశాలల్లో రూ. 804.1 కోట్ల వ్యయంతో 2048 పనులు జరిగాయి. అద్దంకి నియోజకవర్గంలోని 280 పాఠశాలల్లో రూ.75.09కోట్లతో 458 పనులు జరిగాయి. బాపట్లలోని 210 పాఠశాలల్లో రూ.45.08 కోట్లతో 237 పనులు, చీరాలలోని 125 పాఠశాలల్లో రూ.38.16కోట్లతో 180 పనులు, పర్చూరులోని 263 పాఠశాలల్లో రూ.53.70కోట్లతో 371 పనులు, రేపల్లెలోని 282 పాఠశాలల్లో రూ.46.21కోట్లతో 381 పనులు, వేమూరు నియోజకవర్గంలోని 273 పాఠశాలల్లో రూ.45.86కోట్లతో 424 పనులు జరిగాయి. నేటి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గత ప్రభుత్వంలో మంజూరైన పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి.



కూటమి సర్కార్ నిర్లక్ష్యంతో మధ్యలో నిలిచిన ముత్తాయపాలెం హైస్కూల్ భవనం నిర్మాణ పనులు

మా బాధలు అర్థం చేసుకోవాలి



మేం మండలంలోని కనకాద్రినగర్‌లో ఉంటాము. నేను ప్రతిరోజు పొద్దున్నే లేచి ఇళ్లల్లో పాచిపనికి పోతాను. మా ఆయన డప్పులు కొట్టేందుకు, అవిలేనప్పుడు తాపీ పనులకు పోతుంటాడు. నాకు నిఖిల్, నితీష్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. విద్యార్థుల ఫీజులు, ఇతర అవసరాలకు అప్పులు చేస్తున్నాం. తల్లికి వందనం డబ్బులు ఎప్పుడు ఇస్తారోనని ఎదురుచూస్తున్నాం.

– జె. లలిత, కనకాద్రినగర్, బాపట్ల

ఫీజులు చెల్లించాలంటే భారంగా ఉంది



నేను పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాను. నా భర్త పట్టణంలో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుంటారు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దోడు 4వ తరగతి, చిన్నోడు 2వ తరగతి చదువుతున్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మా ఇంట్లో ఇద్దరికి కలిపి ఏడాదికి రూ. 30 వేలు వస్తాయని ఆశపడ్డాం. ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తున్నాం.

– ఎం.జ్యోతి, డ్రైవర్స్ కాలనీ, బాపట్ల

బర్లీపై బేఖాతర్ !

- సర్కార్ ఆదేశాలు లెక్క చేయని టుబాకో కంపెనీలు
- రైతుల వద్ద బ్లాక్ బర్లీ కొనాలన్న ప్రభుత్వం
- జీపీఐ మినహా పొగాకు కొనని ఇతర కంపెనీలు
- మొక్కుబడి కొనుగోళ్లతో సరిపెట్టిన ఐటీసీ
- పేరుకు 22 కంపెనీలు ఉన్నా 25 వేల టన్నులు కూడా కొనని వైనం
- ఇంకా రైతుల వద్ద 62 వేల టన్నుల బ్లాక్ బర్లీ పొగాకు నిల్వలు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: రైతుల వద్ద ఉన్న బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని మే నెల 24న పర్చూరు ప్రాంతంలో పర్యటించిన మంత్రుల బృందం ఆదేశించినా టుబాకో కంపెనీలు ఐ డోంట్‌కేర్ అంటున్నాయి. పొగాకు కొనాలని 22 కంపెనీలను ఆదేశిస్తే ఒకటి రెండు కంపెనీలు మినహా మిగిలినవి మొక్కుబడిగా కూడా కొనడం లేదు. కొన్ని కేవలం 10 టన్నులు కొని చేతులు దులుపుకున్నాయి. ప్రభుత్వం ఆదేశించి రెండు వారాలు దాటుతున్నా గురువారం నాటికి కేవలం 24,571 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశాయి. ఒక్క జీపీఐ లిమిటెడ్ కంపెనీ 3,426 మెట్రిక్ టన్నులు, ప్రధాన కంపెనీగా ఉన్న ఐటీసీ కేవలం 758 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. యార్లగడ్డ ఆగ్రోస్ 771 టన్నులు, కార్‌టెల్ 1933, అలి ఎంటర్ ప్రైజెస్ 766, మహమ్మద్ ఎంటర్ ప్రైజెస్ 918, కళ్యాణీ టుబాకో 525, ఎస్‌బి ఇంపెక్స్ 460 టన్నుల చొప్పున కొనుగోలు చేయగా ఇక వేహా 12 టన్నులు, ప్రేవైల్ 46, ట్రేడ్ వెల్ 16, మహంకాళీ 10, ఎలైట్ ఆగ్రో 50 టన్నుల చొప్పున మాత్రమే కొనుగోలు చేసి మమ అనిపించాయి.

వంద మెట్రిక్ టన్నుల లోపే...

కొన్ని కంపెనీలు వంద మెట్రిక్ టన్నుల లోపే బ్లాక్‌బర్లీ కొనుగోలు చేశాయి. మొత్తంగా 22 కంపెనీలు కలిపి కేవలం 24, 571 మెట్రిక్ టన్నులు కొనగా ఒక్క జీపీఐ 3,500 టన్నులు కొంది. జీపీఐ నిత్యం రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేస్తోంది. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం రైతుల వద్ద 87.23 మెట్రిక్ టన్నుల పొగాకు దిగుబడి ఉండగా గురువారం నాటికి 24.57 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

పట్టించుకోని సర్కార్

జిల్లాలో రైతుల వద్ద ఉన్న బ్లాక్‌బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేయిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత కొనుగోళ్లను ఏమాత్రం పర్యవేక్షించక చేతులెత్తేసింది. దీంతో కొనుగోళ్లు దాదాపు నిలిచిపోయాయి. మే 24న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో కూడిన మంత్రుల కమిటీ పర్చూరు నియోజకవర్గంలో పర్యటించి రైతుల వద్ద పొగాకు కొనాలని కంపెనీలను ఆదేశించాయి. మొత్తం పొగాకు కొనిపిస్తామని మాటిచ్చారు. ప్రధానంగా ఐటీసీ లాంటి పెద్ద కంపెనీలు కేవలం 758 మెట్రిక్ టన్నులు కొని చేతులు దులుపుకోవడం విమర్శలకు దారితీసింది. పొగాకు కొనిపించే విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపించడం లేదనడానికి ఇదే నిదర్శనమని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీతోపాటు రైతు నాయకులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వం కొన్నా 20 వేల మెట్రిక్ టన్నులకు మించి కొనుగోలు చేసే పరిస్థితి ఉండక పోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే పర్చూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు నియోజకవర్గంలోని పచ్చపార్టీ కార్యకర్తల పొగాకు మాత్రమే కొని చేతులు దులుపు కునే అవకాశముందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం పొగాకు కొనాల్సిందే



పర్చూరు నియోజకవర్గంలో వేలాది మంది రైతులు బ్లాక్ బర్లీ సాగు చేశారు. పంట చేతికొచ్చి నెలలు అవుతున్నా ఒక్క జీపీఐ కంపెనీ మినహా మిగిలిన వారు మొక్కుబడిగా కొన్నారు. ప్రభుత్వం టుబాకో కంపెనీల మెడలు వంచి మొత్తం పొగాకు కొనిపించాలి. లేదా మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలి. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనకు దిగుతాం.

– గాదె మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త

ప్రభుత్వం స్పందించాలి



ఇంకొల్లుతోపాటు నియోజకవర్గంలో రైతులు బ్లాక్ బర్లీ అధికంగా సాగు చేశారు. ఇప్పుడు ఒకటి రెండు కంపెనీలు తప్ప మిగిలిన వారు పొగాకు కొనక రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని కంపెనీలతో కొనిపించడమా? లేదా ప్రభుత్వమే కొన డమో చేయాలి. ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉంది.

– భవనం శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ, ఇంకొల్లు మండలం

జూలై 26, 27 తేదీల్లో టైప్‌రైటింగ్ పరీక్షలు

రేపల్లె: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మంగళగిరి వారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలలో టైప్‌రైటింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీ టైప్‌రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 26, 27 తేదీలలో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను, అదనంగా ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్ పరీక్షలు 36 కేంద్రాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జులై 12, 13 తేదీలలో తెలుగు, ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ అన్ని గ్రేడ్‌ల పరీక్షలు 7 కేంద్రాలలో నిర్వహిస్తారు. టైప్, షార్ట్ హ్యాండ్ పరీక్షలకు హాజరుకాదలచిన అభ్యర్థులు పూర్తి వివరాలకు స్థానికంగా ఉన్న టైప్ ఇనిస్టిట్యూట్‌లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

కురిచేడు ఎంపీడీఓ సస్పెన్షన్

కురిచేడు: కురిచేడు ఎంపీడీఓ, ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న బి.సతీష్ బాబుపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. గతంలో బాపట్ల జిల్లా భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో నిధులు దుర్వినియోగం చేసినట్లు నిరూపణ కావడంతో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ మంగళవారం సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు రాగా గురువారం ఎంపీడీఓ విధుల నుంచి వైదొలిగారు. కురిచేడు ఇన్‌చార్జి ఎండీపీఓగా దొనకొండ ఎంపీడీఓ ఎం.శ్రీదేవిని నియమించారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామ సమీపంలోని ఏపీఐఐసీకి చెందిన భూములను తైవాన్ దేశానికి చెందిన ఏషియా కంపెనీ పారిశ్రామికవేత్తలు పరిశీలించారు. లెదర్ పార్కు ఏర్పాటు కోసం గురువారం వారు ఆయా భూముల గురించి తెలుసుకున్నారు. భవన నిర్మాణాలకు అనుకూలత, నీటి వసతి, విద్యుత్, భూగర్భ జలాలు, నేషనల్ హైవే, ఇతర రహదారి మార్గాలను వారు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ బి. కిరణ్ కుమార్‌తో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇండస్ట్రియల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లిలో సీఐటీయూ మహాసభ



సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సీఐటీయూ) 4వ రాష్ట్ర మహాసభ పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో గల పుతుంబాక వెంకటపతి భవన్ నందు శుక్రవారం నిర్వహించనున్నట్లు వీఆర్ఏల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ గురువారం తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు. ముఖ్యంగా మహాసభలలో వీఆర్ఏల సమస్యలపై చర్చ, భవిష్యత్తు కార్యాచరణ, నూతన కార్యవర్గం తదితర అంశాల మీద చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకత్వం, డివిజన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు.

త్వరలో పిడుగురాళ్ల వైద్య కళాశాల ప్రారంభిస్తాం

రెంటచింతల: పిడుగురాళ్ల వైద్య కళాశాలను రానున్న విద్యాసంవత్సరంలోనే ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ వెల్లడించారు. గురువారం రాత్రి రెంటచింతలలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 3100 ఆరోగ్య ఉప కేంద్రాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులు మళ్లించి అసంపూర్తిగా నిర్మించిందని తెలిపారు. కేంద్రం నిధులతో కూటమి ప్రభుత్వం మరో 1700 ఆరోగ్య ఉప కేంద్రాలను గ్రామాలలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు బిఎస్సీ నర్సింగ్ చదివిన విద్యార్థులను వినియోగించుకుంటామని ఆయన తెలిపారు.

‘కూటమి’ విష సంస్కృతి

- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై వేధింపులు
- నూతన విద్యుత్ స్తంభాలు నిలిపివేత
- గ్రామంలో కూటమి నాయకులకే వత్తాసు పలుకుతున్న విద్యుత్ అధికారులు

జె.పంగులూరు: నిన్నటి వరకు కలిసిమెలిసి ఒకే కుటుంబంలా జీవించే గ్రామాలు నేడు రాజకీయ రంగు పులుముకుంటున్నాయి. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ఉండే గ్రామాలు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగంలో చితికి పోతున్నాయి. కూటమి పెద్దలు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై రాజకీయ కక్ష పెంచుకొని, వారిని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని చందలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 8వ వార్డులో గొట్టిపాటి వారి బజారు ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ వార్డు నుంచి కుంచాల రమాదేవి అనే మహిళ వార్డు మెంబరుగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలిగా గెలిచింది. అయితే గొట్టిపాటి వారి బజారు నుంచి వార్డు మెంబరుగా నిలబడి గెలవడమే ఆ బజారు వారు చేసిన తప్పుగా మారింది. 2024 లో కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి వారిని అన్ని విధాలుగా ఇబ్బందులు గురిచేస్తున్నారు.



గొట్టిపాటి బజారులో స్తంభాలు



పగుళ్లిచ్చిన విద్యుత్ స్తంభం

40 ఏళ్ల నాటి కరెంటు స్తంభాలు

గొట్టిపాటి వారి బజారుకి 1984లో మూడు స్తంభాలు వేసి కరెంటు లైన్ లాగారు. అయితే ప్రస్తుతం చందలూరు గ్రామంలో పాత స్తంభాల స్థానంలో కొత్తవి వేస్తున్నారు. అందరితో పాటు తమకూ వేస్తారులే అని అ బజారు వారు అనుకున్నారు. కానీ ఊరు మొత్తం కొత్త స్తంభాలు వేసి కరెంటు లైన్లు లాగిన సిబ్బంది.. ఆ బజారును మాత్రం అలానే వదిలేశారు. 40 సంవత్సరాల నాటి స్తంభాలు పూర్తిగా వంగి పోయి కరెంటు వైర్లు కిందికి జారాయి. ఎప్పుడు విరిగిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. అధికారులు మాత్రం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటానికే నిర్ణయించుకున్నట్లుంది.

కలెక్టర్‌కు అర్జీ

గొట్టిపాటి వారి బజారుకు చెందిన స్థానికులు ఏప్రిల్ 7న బాపట్ల కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ వెంటనే 15 రోజుల్లో సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే కొత్తం స్తంభాలు వేస్తామని, అడ్డు వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పి సంతకాలు చేయించుకొని.. ఆన్‌లైన్‌లో అర్జీ రద్దు చేశారు. చేసేది లేక తిరిగి గొట్టిపాటి బజరు వారు మే 19న కలెక్టర్‌కు మరో సారి అర్జీ ఇచ్చారు. కలెక్టర్ సమస్య పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉచిత సలహాలు ఇస్తున్న అధికారులు

విద్యుత్ ఏఈ గొరంట్ల అనిల్ కుమార్‌కు ఫోన్ చేసి తీగలు వేల్లాడుతున్నాయని చెబితే.. కర్రలు అడ్డు పెట్టుకోమని తమకు ఉచిత సలహాలు ఇస్తున్నారని స్థానికులు వాపోయారు. స్తంభాలు ధ్వంసం అయ్యాయని తెలిపినా.. వాటి జోలికి వస్తే ఊరుకోమంటూ దురుసుగా మాట్లాడారని తెలిపారు.

కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదు



ప్రస్తుతం నేను 8 వ వార్డు నుంచి వైఎస్సార్ సీపీ సానుభూతి పరురాలిగా మెంబరుగా గెలిచాను. అప్పటి నుంచి రాజకీయ కక్షలు చేస్తున్నారు. కలెక్టర్‌కు నేను రెండు సార్లు అర్జీలు ఇచ్చినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు చేస్తామని మభ్య పెట్టి నాతో మూడు చోట్ల సంతకాలు చేయించుకొని.. మరుసటి రోజు వచ్చి చేస్తామన్నారు. ఫోన్ చేసి అడిగితే దురుసుగా మాట్లాడుతున్నారు.

– కుంచాల రమాదేవి, 8వవార్డు మెంబర్, చందలూరు

అధికారులు రాజకీయ నాయకులుగా వ్యవహరిస్తున్నారు



మేము కలెక్టర్‌కు అర్జీ పెట్టి వచ్చిన తరువాత రెండు రోజుల్లో సమస్యను పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పుడు మాట మారుస్తున్నారు. అధికారులు కూడా రాజకీయం చేస్తున్నారు. రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతున్నారు.

– రేపల్లే ఆంజనేయులు (చందలూరు)

వీలైనంత త్వరలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తాం

స్థానికులు అర్జీ పెట్టిన మాట వాస్తవం. త్వరలో గొట్టిపాటి బజారు అర్జీ క్లియర్ చేస్తాం. ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదు. పాత స్తంభాల స్థానంలో కొత్తవి వేసి, కరెంటు వైర్లు లాగుతాం.

– గోరంట్ల అనిల్ కుమార్, విద్యుత్ ఏఈ

నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

మంత్రి గొట్టిపాటికి రైతుల వినతి

జె.పంగులూరు: మండల కేంద్రమైన పంగులూరు గ్రామంలోని మార్కెట్ యార్డులో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు రైతులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని చందలూరు గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన్ను పలువురు పొగాకు రైతులు కలిశారు. మండలంలో సుమారు 43 వేల క్వింటాళ్లకు పైగా నల్లబర్లీ పొగాకు నిల్వ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు ప్రాంతాల్లో అధికంగా పొగాకు నిల్వలు ఉనందున ఆ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంగులూరు పరిసర ప్రాంతాల గ్రామ రైతులు పొగాకు నిల్వలను విక్రయించుకునేందుకు అనువుగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతులు అడ్డగడ సతీష్, అడ్డగడ సుబ్బయ్య, కర్రి వెంకటసుబ్బారావు, రావూరి రమేష్ బాబు, ఎన్టీర్ వెంకటేశ్వర్లు, నార్వే శ్రీనివాసరావు, కుక్కపల్లి ఏడుకొండలు తదితరులు ఉన్నారు.



వన మహోత్సవ సందర్భంగా చందలూరులో మొక్క నాటుతున్న మంత్రి గొట్టిపాటి

మొక్క నాటిన మంత్రి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని చందలూరులో వన మహోత్సవం సందర్భంగా మొక్క నాటారు. ఎంపీడీఓ కె. స్వరూపరాణి, ఏపీఓ కె. సంతోషం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డీఈ శ్రీనివాస్, ఏఈ శివయ్య, ఈఓఆర్డీ సుమంత్, పంచాయతీరాజ్ ఏఈ గడ్డం హనుమంతరావు పాల్గొన్నారు.

అదుపు తప్పిన రెండు కార్లు

పంట కాలువల్లో బోల్తా

కారంచేడు : దగ్గుబాడు నుంచి చీరాలకు వస్తున్న కారు నాలుగురోడ్ల సెంటర్ దాటి మామిడి తోట సమీపంలోకిగా రాగానే గాడిలో టైర్లు పడటంతో అదుపుతప్పి రోడ్డు మార్జిన్ ఉన్న పంట కాలువలో పడిపోయింది. బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వీరగంధం రామకృష్ణ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. మధ్యాహ్నం పోతినవారిపాలేనికి చెందిన ఎనికపాటి మస్తాన్‌రావు చీరాలకు వెళ్తుండగా పోతినవారిపాలెం గ్రామం దాటిన ఒక కిలోమీటరు దూరంలోనే ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి కారు అదుపుతప్పింది. రోడ్డు పక్కన ఉన్న పంట కాలువలో పడిపోయింది. దీంతో ఆయన కారులోను బెలూన్లు ఓపెన్ అయ్యాయి. ఆయన కూడా స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.



పంట కాలువలో పడి పూర్తిగా దెబ్బతిన్న రామకృష్ణకు చెందిన కారు

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలి

అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. లావణ్య

నరసరావుపేట టౌన్: పర్యావరణ సమతుల్యం కోసం మొక్కలు నాటాలని అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. లావణ్య సూచించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సందర్భంగా గురువారం రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక న్యాయస్థానం ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని ప్రసంగించారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలనీ, కాలుష్యాన్ని నివారించడం కోసం అందరమూ కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించడంతోపాటు ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకాన్ని నివారించాలని తెలిపారు. అనంతరం న్యాయస్థాన భవనాల ఆవరణలో న్యాయాధికారి లావణ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్ట్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి ఎం. లావణ్య

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ ఎం.వి. చరణ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ లోకనాథ్, ఎస్‌ఐలు కిశోర్, అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సీనియర్ చెస్ విజేత ధ్రువేష్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ పోటీల్లో విజేతగా డి.ధ్రువేష్ నిలిచాడు. ఆ తర్వాత మూడు స్థానాల్లో కె.హర్షవర్ధన్, ఎ.హరిసూర్యనారాయణ, కీర్తి రానా నిలిచారు. ఈ నెల 7, 8వ తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ నలుగురు పాల్గొంటారని నిర్వాహకుడు వైవీకే చక్రవర్తి తెలిపారు. అనంతరం విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర రాజు, హిందూ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి రామకృష్ణమూర్తి, చక్రవర్తి బహుమతి ప్రదానం చేశారు.



అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు



దుగ్గిరాల: డ్రైవరు మద్యం మత్తులో ఉండగా అదుపు తప్పిన కారు కాలువలోకి దూసుకెళ్లింది. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో గురువారం మధ్యాహ్నం చిలువూరు నుంచి కె.ఆర్.కొండూరు గ్రామం వైపు కారు వేగంగా వెళుతోంది. ఈ క్రమంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. స్థానికులు చూసి కారులోని డ్రైవరును బయటకు తీశారు. అతడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చిలువూరులో పక్కపక్కనే రెండు మద్యం దుకాణాలు ఉండటం వల్ల కొందరు నిత్యం తాగి వేగంగా ద్విచక్రవాహనాలు, కార్లను నడుపుతున్నారని స్థానికులు చెప్పారు. పలువురు ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. అధికారులకు అనేకసార్లు ఇక్కడ మద్యం దుకాణాలు తొలగించాలని కోరినా స్పందించలేదని పేర్కొన్నారు.

కౌలు రైతులకు రుణాలు పెంచాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: జిల్లాలో కౌలు రైతులకు ఇవ్వాల్సిన రుణ లక్ష్యాలను ఆశించిన స్థాయిలో బ్యాంకర్లు పూర్తి చేయలేదని, దీన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో 2025 త్రైమాసికానికి సంబంధించి డీసీసీ, డీఎల్ఆర్సీ బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు రూ. 180 కోట్ల రుణ లక్ష్యం కాగా, రూ. 60 కోట్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. దీన్ని మరింత పెంచి పెండింగ్ రుణాలు అందించాలన్నారు. విద్య, గృహ రుణాలు పెంచేందుకు బ్యాంకర్లు, విద్యా సంస్థలు, ఇంజినీరింగ్ కళాశాలలు, తదితర రద్దీ ప్రాంతాల్లో రుణ మేళా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిపైన సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. దీనిలో భాగంగా కనీసం రూ. 20 వేల మందికి రుణాలు ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీసీఎం, పీఎంఎఫ్ ఎంజీ, ముద్ర రుణ లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2024–25 కు సంబంధించి వ్యవసాయ రంగానికి రూ.13,613 కోట్ల రుణ లక్ష్యం కాగా, రూ.16,266 కోట్లు అంటే 119 శాతం మంజూరు చేశారన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 9,495 కోట్లు రుణ లక్ష్యం కాగా, రూ. 10,679 కోట్లు అంటే 112 శాతం మంజూరు చేశారన్నారు. ప్రాధాన్యత రంగానికి సంబంధించి విద్యా రుణాలు రూ.114.5 కోట్లు లక్ష్యం కాగా, రూ.95.87 కోట్లు మంజూరు చేశారన్నారు. గృహ రుణాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని అసహనం వ్యక్తం చేశారు. దీనిలో రూ.664 కోట్లు లక్ష్యం నిర్ణయిస్తే, రూ.182 కోట్లు అంటే కేవలం 27.5 శాతం మాత్రమే మంజూరు చేశారని తెలిపారు. మొత్తం వార్షిక రుణ లక్ష్యం రూ.34,730 కోట్లకు గాను, రూ.44,918 కోట్లు అంటే రూ.129 కోట్లు మంజూరు చేసి రుణ లక్ష్యాలను దాటినందుకు బ్యాంకర్లను అభినందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లాకు సంబంధించి నాబార్డు పీఎల్‌పీ 2025 –26 పుస్తకాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, యూడీఐ రీజనల్ హెడ్ జవహర్, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి, నాబార్డు డీడీఎం శరత్, ఏడీఏ వెంకటేశ్వర్లు, ఆర్‌బీఐ ఎల్డీవో నవీన్‌లు ఆవిష్కరించారు.

బంగారం కోసమే వృద్ధురాలి హత్య

తెనాలి ముత్తెంశెట్టిపాలెం కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్: తెనాలి ముత్తెంశెట్టిపాలెంలో ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున వృద్ధురాలి హత్య కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. తెనాలి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి. జనార్దనరావు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ముత్తెంశెట్టిపాలెంలో తాడిపత్రి మల్లీశ్వరి టిఫిన్ బండి నిర్వహిస్తూ ఒంటరిగా జీవిస్తోంది. కుమార్తె, కుమారుడికి వివాహాలయ్యాయి. వారు ఇదే ప్రాంతంలో వేర్వేరుగా ఉంటున్నారు. ఒంటరిగా ఉంటున్న మల్లీశ్వరి బంగారు ఆభరణాలను ధరించి ఉండడాన్ని ఆమె ఇంటి పక్కనే నివసిస్తున్న 24 ఏళ్ల నన్నెపాముల తారక జోషి గమనించాడు. ఇతడు గతంలో బాపట్ల జిల్లా నగరం మండలం ధూళిపూడి గ్రామంలో నివసించేవాడు. వివాహమై, చెడు వ్యసనాలతో అప్పులపాలైన అతను ఆ ఆభరణాలను దోచుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు తమ్ముడు సతీష్‌కుమార్ సహాయం తీసుకున్నాడు. 3వ తేదీ తెల్లవారుజామున ఐదు గంటలకు మల్లీశ్వరి నీళ్ల కోసం పంపు వద్దకు రాగా ఆమెను గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకెళ్లి మంచంపై పడుకోబెట్టారు. బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఆ బంగారంలో కొంత తారక జోషి తనకు పరిచయమున్న సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన మహిళ గాజులవర్తి కీర్తికి ఇచ్చాడు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారిస్తున్న క్రమంలో చిక్కిన నిందితులు నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. ఆ ఆభరణాలను ఆమె తాకట్టు పెట్టిందని, వాటిని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కేసును 48 గంటల్లో ఛేదించిన వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు, సిబ్బందిని ఆయన అభినందించారు.

నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచిపేరు తీసుకురండి

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాబు హుస్సేన్
- జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ జట్టులతో మాబు హుస్సేన్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీడీలు

సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాబు హుస్సేన్ అన్నారు. స్థానిక సుగాలీ కాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ గురువారం జరిగాయి. ఈ సెలక్షన్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది బాలురు, 50 మంది బాలికలు ఫుట్‌బాల్ క్రీడలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పెట్టుకొని రాణించాలన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీరామ్ రెడ్డి, అచ్చిరెడ్డి, మహబూబ్ సుభాని, నరసింహారావులు మాబు హుస్సేన్‌ను ఘనంగా సత్కరించారు. పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాకు సెలెక్ట్ అయిన ఫుట్‌బాల్ క్రీడాకారులు త్వరలో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల, బాలికల జట్లను ప్రకటించారు.

ఆధునిక వ్యవసాయ విధానంతో అధిక దిగుబడులు

కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు

పెదకూరపాడు: ఆధునిక వ్యవసాయ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. కృషి విజ్ఞాన్ కేంద్రం వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప యాత్ర పెదకూరపాడులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అంటే డ్రోన్ల ప్రాముఖ్యత, అధునాతన యంత్రాలు గురించి వివరించారు. అవి ఎలా ఉపయోగపడతాయో తెలియచేశారు. కృషి విజ్ఞాన కేంద్రం లాంఫాం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయం, అనుబంధ రంగాల పథకాల గురించి వివరించారు. ఈనామ్ పోర్టల్ వినియోగం, కిసాన్ సారధి టోల్ ఫ్రీనెంబరు గురించి వివరించారు. ఉద్యానశాఖలో అమలవుతున్న పండ్ల తోటలు, పూల తోటలకు ఇచ్చే సబ్సిడీల వివరాలను ఉద్యానవన శాఖాధికారి యు.శ్రీ నిత్య వివరించారు. పశు సంవర్ధకశాఖ పథకాలను గురించి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి.శ్రీదేవి తెలియచేశారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న పీఎం కిసాన్ మట్టి నమూనాల సేకరణ, 50 శాతం రాయితీపై పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ మొదలైన పథకాల గురించి ఏవో ఐ శాంతి తెలియచేశారు. జీవ శిలీంద్రనాసిని అయిన ట్రైకోడెర్మావిరిడి ప్యాకెట్లను కృషి విజ్ఞాన కేంద్రం, లాంఫాం శాస్త్రవేత్తలు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.జ్యోతి, పి.ధనలక్ష్మీ షేక్ హసన్ బాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

16 మందికి హెడ్ నర్సులుగా ఉద్యోగోన్నతి

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న 16 మందికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్ నర్సులుగా ప్రమోషన్ ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు 17 మంది స్టాఫ్ నర్సులను ప్రమోషన్ కోసం పిలువగా, ఒకరు ప్రమోషన్ వద్దని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ప్రమోషన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో ఎనిమిది మంది, ఒంగోలు జీజీహెచ్‌లో ఐదుగురు, నెల్లూరు జిల్లాలో ముగ్గురు హెడ్ నర్సులుగా చేరారు. సుమారు ఆరు నెలలుగా ప్రమోషన్‌ల కోసం ఎదురు చూస్తున్న నర్సింగ్ సిబ్బంది ఎట్టకేలకు కౌన్సెలింగ్ జరగడంతో నర్సింగ్ యూనియన్ నేతలతో కలిసి గురువారం మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుచిత్రాదేవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటు, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ నాగూర్ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొన్నారు. ఆర్డీకి కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా సెక్రటరీ వెల్లంపల్లి పద్మజ, వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ప్రమోషన్ ఉత్తర్వులు అందుకుంటున్న నర్సింగ్ సిబ్బంది